సాక్షి
ప్రకాశం

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



యువ వ్యాపారి ఆత్మహత్య

వైపాలెం మండలం బోయినపల్లెకు చెందిన యువ వ్యాపారి తన ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లి ఆత్మ హత్య చేసుకుని చనిపోయాడు. - 8లో..



పింఛన్లు పీకేశారు

గిద్దలూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సుమారు వంద పింఛన్లకుపైగా తొలగించారు. దీంతో పింఛన్‌దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
35 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఏఆర్ ఏఎస్పీగా కొల్లూరు శ్రీనివాసరావు



ఎస్పీ దామోదర్‌ని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా కొల్లూరు శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన కొల్లూరు శ్రీనివాసరావు 1991లో ఆర్ఎస్ఐగా పోలీసు శాఖలో చేరారు. తొలి పోస్టింగ్ నెల్లూరులో చేశారు. 2001లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది విజయవాడకు బదిలీ అయ్యారు. అక్కడ నుంచి 2003లో ఒంగోలు పీటీసీకు వచ్చారు. ఆ తరువాత 2003 నుంచి 2009 వరకు ఆర్ఐ హోం గార్డుగా నెల్లూరు, ప్రకాశం జిల్లాలో విధులు నిర్వహించారు. 2009లో అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా టీటీడీలో పనిచేశారు. 2011లో డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన గ్రే హౌండ్స్ విభాగంలో హైదరాబాద్, వైజాగ్‌లలో 2013 వరకు విధులు నిర్వహించారు. 2014లో నెల్లూరు డీటీసీ వైస్ ప్రిన్సిపాల్‌గా, 2014-18లో నెల్లూరు, ప్రకాశం హోంగార్డ్స్ డీఎస్పీగా పనిచేశారు. ఆ తరువాత విజిలెన్స్ డీఎస్పీగా ఏపీ జెన్‌కోకు బదిలీ అయిన ఆయన కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరులలో ఆరున్నరేళ్లు విధులు నిర్వహించారు. 2024 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు కడప డీఎస్పీగా విధులు నిర్వహించారు. ఏఎస్పీగా పదోన్నతిపై ఒంగోలు ఏఆర్‌లో బాధ్యతలు చేపట్టారు.

జిల్లా విద్యుత్ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్‌గా హరికృష్ణ

కనిగిరిరూరల్: విద్యుత్ శాఖలోని కార్మిక సంఘాల ప్రకాశం జిల్లా జేఏసీ చైర్మన్ సీహెచ్ హరి కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీహెచ్ హరి కృష్ణ మాట్లాడుతూ విద్యుత్ శాఖలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం తీవ్ర కాలయాపన చేస్తోందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 15వ తేదీ నుంచి సమ్మె చేపట్టేందుకు నోటీసు ఇచ్చినట్లు చెప్పారు. సమ్మెను విజయవతం చేసేందుకు కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఒంగోలు మెడికల్ కాలేజీకి అదనంగా 30 సీట్లు

ఒంగోలు టౌన్: ఒంగోలు మెడికల్ కాలేజీకి 30 ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయి. ఇప్పటి వరకు 120 సీట్లు ఉండగా పెరిగిన సీట్లతో 150 కు చేరింది. ఇందులో ఇండియా కోటాలో 22 సీట్లు, స్టేట్ కోటాలో 128 సీట్లు వస్తాయి. దీంతో మన రాష్ట్ర విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. అదనంగా మరో 50 సీట్లు కేటాయించాలని ఎన్ఎంసీకి ఇటీవల ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. పరిశీలన అనంతరం ఎన్ఎంసీ 30 సీట్లు పెంచుతూ నిర్ణయం తీసుకొందని వివరించారు. సీట్ల పెంపు కోసం పనిచేసిన కళాశాల సిబ్బందికి, ప్రొఫెసర్లకు ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు అభినందనలు తెలిపారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లో శంకర్ నారాయణకు చోటు

మార్కాపురం: మార్కాపురానికి చెందిన హాస్య బ్రహ్మ శంకర్‌నారాయణ వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించుకున్నారు. బుధవారం హైదరాబాదులోని త్యాగరాయ గానసభ కళావేదికలో త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బీ నరేంద్రగౌడ్ శంకరనారాయణకు రికార్డును అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌నారాయణ మాట్లాడుతూ తాను 27 ఏళ్ల నుంచి దేశ విదేశాల్లో వేలాది హాస్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 550 హాస్యావధానాలు చేశానని, త్యాగరాయ గానసభలోనే 25 గంటలపాటు నిర్విరామ ప్రజా హాస్యావధానం నిర్వహించినట్లు చెప్పారు. దీంతో వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుచేసి తనకు అందజేశారన్నారు.

కొండపి నియోజకవర్గంలో సహజ సంపదను అధికార పార్టీ నేతలు కొల్లగొట్టేస్తున్నారు. కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, చెరువుల్లో ఇసుక, మట్టిని ఎడాపెడా తవ్వేస్తున్నారు. భారీ యంత్రాలతో తోడేస్తున్నారు. నదీగర్భాలకు తూట్లు పొడుస్తున్నారు. కొండలు, గుట్టల స్వరూపాలే మారిపోతున్నాయి. పచ్చపార్టీ నేతల అండదండలతో పగలూ, రాత్రి అన్న తేడా లేకుండా దోపిడీ సాగుతోంది. అడ్డగోలుగా రూ.కోట్లు విలువజేసే సంపదను దోచేస్తున్నా సంబంధిత అధికారులకు మాత్రం కనిపించడం లేదు. తమ జేబులు నిండుతుండడంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



టంగుటూరు మండలం కొణిజేడు గ్రామం వద్ద కొండల మధ్య ప్రభుత్వ భూమిలో ఎర్ర మట్టిని పొక్లయినర్‌తో తవ్వి టిప్పర్ లారీలకు లోడ్ చేస్తూ..

తవ్వకాలు జోరుగా..
దోపిడీ సహజంగా!

- కొండపి నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా సహజ వనరుల తవ్వకాలు
- సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లో గ్రావెల్ దందా
- రోజూ లక్షలాది రూపాయల విలువైన గ్రావెల్ అక్రమ రవాణా
- జరుగుమల్లి, పొన్నలూరు, సింగరాయకొండ మండలాల్లో ఇసుక దందా
- చెరువులనూ వదలని అక్రమార్కులు
- రెవెన్యూ, మైనింగ్ పోలీస్ శాఖలు పట్టించుకోని వైనం
- అధికారులకు భారీగా ముడుపులు
- ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే అక్రమ మైనింగ్

సాక్షి టాస్క్‌ఫోర్స్:

కొండపి నియోజకవర్గంలో పచ్చ తమ్ముళ్ల ఇసుక, గ్రావెల్ దందా జోరుగా సాగుతోంది. ప్రధానంగా జరుగుమల్లి, పొన్నలూరు మండలాల పరిధిలోని పాలేరు నదిలో, సింగరాయకొండలోని మన్నేరులో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతిరోజు వెయ్యికి పైగా ట్రాక్టర్లు, 50 కిపైగా టిప్పర్లలో ఇసుక తరలిస్తూ కోట్లాది రూపాయల సహజ సంపదను కొల్లగొడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో అక్రమ తవ్వకాలు చేస్తుండడంతో పాలేరులో భారీ గుంతలు ఏర్పడి నది రూపురేఖలే మారిపోయాయి. అక్రమ రవాణా కారణంగా భారీగా వాహనాలు తిరుగుతుండడంతో పొలాలకు వెళ్లే రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నియోజకవర్గ పెద్దల సహకారంతో అక్రమ దందా నడుస్తుండటంతో మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు అక్రమార్కులను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. సామాన్యుడు రీచ్‌లోకెళ్లి ఇసుక తెచ్చుకోవాలంటే పచ్చ తమ్ముళ్ల అనుమతి తప్పనిసరి. వీరు ట్రాక్టరు లోడింగ్‌కు ప్రాంతాన్ని బట్టి రూ.500 నుంచి రూ.1000 వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మట్టి దందా సింగరాయకొండ మండలంలో శానంపూడి, పాతసింగరాయకొండ, సోమరాజుపల్లి, టంగుటూరు మండలంలో యరజర్ల, కొణిజేడు, మర్లపాడు, కందులూరు, సర్వేరెడ్డిపాలెం, వల్లూరు ప్రాంతాల్లో జోరుగా సాగుతోంది. సింగరాయకొండ మండల పరిధిలో గతంలో ప్రతిరోజు సుమారు రూ.10 లక్షల వరకు గ్రావెల్ దందా జరగగా, ప్రస్తుతం సుమారు రూ.2 లక్షల వరకు, టంగుటూరు మండల పరిధిలో సుమారు రూ.15 లక్షల వరకు జరుగుతోందన్న ఆరోపణలున్నాయి.

రాత్రి వేళల్లో అక్రమ రవాణా

రాత్రి వేళల్లో మాత్రమే ఈ అక్రమ మైనింగ్ వ్యాపారం జోరుగా సాగుతోంది. రాత్రి 8 నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు యథేచ్ఛగా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక, మట్టిని తరలించుకుపోతున్నారు. సింగరాయకొండ మండలంలో దేవదాయ, అసైన్డ్ భూముల్లో సైతం దందాలకు పాల్పడుతున్నారు. గత మార్చి నెల చివరి వారంలో ప్రజాసంఘాలు, కుల సంఘాల ఫిర్యాదుతో మైనింగ్ అధికారులు దాడులు జరిపి సుమారు రూ.5 లక్షల వరకు జరిమానా విధించారని తెలిసింది. తరువాత కొద్దిరోజులకే అక్రమ రవాణా చేస్తున్న గ్రావెల్ టిప్పర్‌ను మైనింగ్ అధికారులు ఏప్రిల్ మొదటి వారంలో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనికి సంబంధించి జరిమానా రూ.లక్షల్లో విధించగా నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకుల సహకారంతో కేవలం వేలల్లో జరిమానా కట్టారన్న ప్రచారం జోరుగా సాగింది.

శానంపూడి పంచాయతీ పరిధిలో మన్నేరు నుంచి ప్రతి రోజు 30 నుంచి 40 ట్రాక్టర్ల వరకు ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఇక్కడి నుంచి సింగరాయకొండ, ఉలవపాడు మండలాలకు ఇసుకు రవాణా అవుతోంది. ట్రాక్టరు ఇసుక రూ.1,200 నుంచి రూ.1,500 వరకు అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం. పచ్చతమ్ముళ్లు మాత్రమే ఇసుక రవాణా చేయాలన్న ఆంక్షలు ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

జరుగుమల్లి మండలంలో కే బిట్రగుంట, జరుగుమల్లి, చింతలపాలెం, సతుకుపాడు, కామేపల్లి గ్రామాల పరిధిలో పాలేరులో ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. పచ్చ నేతల పర్యవేక్షణలోనే ఇసుక రీచ్‌లు నిర్వహిస్తుండగా రీచ్‌లలో ప్రాంతాలను బట్టి రూ.500 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారని ట్రాక్టరు యజమానులు ఆరోపిస్తున్నారు. సతుకుపాడు, కామేపల్లి ప్రాంతాల్లో అయితే ట్రాక్టర్ల ద్వారా కేవలం పచ్చతమ్ముళ్లు మాత్రమే ఇసుక రవాణా చేస్తున్నారని, ఎవరైనా ఇంటి అవసరాలకు ట్రాక్టరు తీసుకెళ్లి ఇసుక తెచ్చుకోవాలంటే పచ్చనేతలకు కప్పం కట్టాల్సిందే. లేకపోతే అధికారులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



జరుగుమల్లి వద్ద పాలేరు నదిలో ఇసుకను పొక్లయినర్‌తో తవ్వి ట్రాక్టర్‌కు లోడ్ చేస్తూ..



టంగుటూరు మండలం కొణిజేడు గ్రామం వద్ద కొండల మధ్య ప్రభుత్వ భూమిలో ఎర్ర మట్టిని అక్రమంగా తవ్వడంతో ఏర్పడిన గుంతలు

దేవుడి భూముల్లోనూ తవ్వకాలు..

సింగరాయకొండ మండలంలోని శానంపూడి పంచాయతీ పరిధిలో నెల్లూరు జిల్లా ఉలవపాడు పంచాయతీలోని నీలకంఠేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 30 ఎకరాల భూమిలో అక్రమ గ్రావెల్ దందా చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై దేవదాయశాఖకు చెందిన ఆర్‌జేసీ స్థాయి అధికారి వచ్చి ఆ ప్రాంతాన్ని పరిశీలించి అక్రమ మైనింగ్ జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పి బోర్డు ఏర్పాటు చేసి వెళ్లారు. అయినా అక్రమార్కులు తవ్వకాలు చేస్తూనే ఉన్నారు. పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలో పచ్చతమ్ముళ్ల ఆధ్వర్యంలో భారీగా అక్రమ మైనింగ్ జరగటంతో ఆ ప్రాంతంలో ఉన్న కొండలు కాస్తా ప్రస్తుతం పొలాలుగా, చెరువుల్లాగా మారాయని, వాటిల్లో పచ్చనేతలు జామాయిల్ తోటలను పెంచుతూ ఆక్రమించుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. టంగుటూరు మండల పరిధిలోని యరజర్ల పంచాయతీ పరిధిలోని కొండల్లో ప్రతిరోజు సుమారు 300 ట్రిప్పర్లు, 50 ట్రాక్టర్లలో గ్రావెల్ దందా యథేచ్ఛగా జరుగుతోంది. ప్రతిరోజు సుమారు రూ.20 లక్షల విలువైన గ్రావెల్‌ను తరలిస్తుండటంతో కొండలు కరిగిపోతున్నాయి. ఈ ప్రాంతంలో మైనింగ్ అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేసినా వాహనాల్లో మట్టి తరలిపోతోంది. మైనింగ్ అధికారులు జేబులు నిండుతుండడంతో మిన్నకుండిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీసు, రెవెన్యూ అధికారులు సైతం మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఎర్రమట్టిని తవ్వి అక్రమంగా తరలించడంతో చెరువుగా మారిన శానంపూడి గ్రామం వద్ద దేవదాయశాఖ స్థలం

నిబంధనలకు తూట్లు

ఇసుక రీచ్‌లలో యంత్రాలతో ట్రాక్టర్లకు లోడింగ్ చేయకూడదన్న నిబంధనలు అమలు కావటం లేదు. నియోజకవర్గ పెద్దల ఆదేశాలతో అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టరు ఇసుక జరుగుమల్లి నుంచి సింగరాయకొండ, టంగుటూరుకు రూ.1,500, ఒంగోలుకు రూ.2,300 కు సరఫరా చేస్తున్నారు. పొన్నలూరు మండలంలోని వేంపాడు గ్రామ పరిధిలో పాలేరు నుంచి భారీగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ప్రతిరోజు సుమారు 300 ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికార పార్టీ నేతల ఒత్తిడితోనే అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

సోషల్ మీడియాలో చైన్ స్నాచింగ్ చూసి

- బట్టల షాపు పెట్టేందుకు దొంగగా మారిన డెలివరీ బాయ్
- పోలీసులకు చిక్కి జైలు పాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీసీఎస్ సీఐ జగదీష్

ఒంగోలు టౌన్: డెలివరీ బాయ్‌గా సంపాదనతో సంతృప్తి పడలేకపోయాడు. బట్టల షాపు పెట్టి బాగా డబ్బులు సంపాదించాలనుకున్నాడు. అందుకు చేతిలో డబ్బులు లేకపోవడంతో దొంగగా మారి చివరికి జైలు పాలయ్యాడు. బుధవారం ఒంగోలు సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ జగదీష్ వెల్లడించిన వివరాల ప్రకారం...గుంటూరు పట్టణానికి చెందిన తాళ్లూరి రాజ్ కుమార్ రత్నపూరి కాలనీలో నివాసం ఉంటాడు. డెలివరీ బాయ్‌గా పనిచేసే రాజ్ కుమార్‌కు అంతంత మాత్రం సంపాదనతో సరిపోక ఇబ్బందులు పడసాగాడు. బట్టల షాపు పెట్టాలని ప్రయత్నించాడు కానీ చేతిలో డబ్బులు లేకపోవడంతో విరమించుకున్నాడు. ఎలాగైనా సరే డబ్బులు సంపాదించాలనుకున్న రాజ్ కుమార్ సోషల్ మీడియాలో చైన్ స్నాచింగ్ చేసే విధానాన్ని చూసి దొంగగా మారాడు. మొదటిసారి తెనాలిలో చైన్ స్నాచింగ్ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. అయినా సరే పట్టువదలకుండా బాపట్లలో చైన్ స్నాచింగ్ చేసి బంగారాన్ని దొంగిలించాడు. అప్పటి నుంచి వరసగా చైన్ స్నాచింగ్ చేయసాగాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో బాపట్ల పట్టణంలోని జండా చెట్టు వీధి ఫిష్ మార్కెట్ ఒక మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించాడు. అదేనెల 24వ తేదీ చీరాలలోని మేడవారి వీధి బొమ్మలతోటలో మహిళ మెడలో బంగారు చైను లాక్కొని పారిపోయాడు. జూలై నెలలో ఒంగోలు నగరంలోని మంగమూరు రోడ్డు లేడీస్ హాస్టల్ వద్ద నిలబడి ఉన్న మహిళ మెడలో చైను దొంగిలించాడు. ఆగస్టు 8వ తేదీ పల్నాడు జిల్లా వినుకొండ మెయిన్ బజారులో కాకుమాను పూర్ణచంద్రరావు గోల్డ్ షాపు వద్ద నిలబడి ఉన్న మహిళ మెడలో బంగారు చైనుతో పాటుగా నల్ల పూసల దండ దొంగిలించాడు. ఒంగోలు చోరీకి సంబంధించి తాలుకా పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. ఈ చోరీలను సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ ఏఆర్ దామోదర్ సీసీఎస్ సీఐ జగదీష్, తాలుకా సీఐ టి.విజయ కృష్ణ, తాలుకా ఎస్సై ఫిరోజ్, సీసీఎస్ సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని దర్యాప్తు చేసిన ప్రత్యేక బృందం బుధవారం నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీ వద్ద రాజ్ కుమార్‌ను అరెస్టు చేశారు. ఆతడి వద్ద ఉన్న రూ.20 లక్షల విలువైన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో ఎస్సై ఫిరోజ్ పాల్గొన్నారు.

దాహం తీర్చండి మహాప్రభో



రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

పొదిలి: నీటి సమస్య పరిష్కారం కాకపోవటంతో సహనం నశించిన మహిళలు రాస్తారోకో చేసిన ఘటన పొదిలి బాప్టిస్ట్‌పాలెంలో బుధవారం రాత్రి జరిగింది. నీటి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు నిరసన చేపడతామని భీష్మించుకుని ఒంగోలు-కర్నూలు రహదారిపై కూర్చొని నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మహిళలు మీడియాతో తమ ఆవేదన వ్యక్తం చేశారు. ''వేసవి, వర్షాకాలం అనే తేడా లేదు, గత సంవత్సర కాలంగా నీటి సమస్య వెంటాడుతోంది. దాహం తీర్చండి మహాప్రభో అని ఎంత మంది అధికారులు, నాయకుల వద్ద మొరపెట్టుకున్నా ఒక్కరూ కనికరం చూపలేదు. దీంతో నీరు కొనుక్కోవాల్సి వస్తోంది. ఇంటికొకరు పని మానుకుని నీరు ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. మరి కొంత మంది బోర్‌నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. ఆ బోర్లు కూడా అడుగంటిపోవటంతో ఏం చేయాలో పాలు పోవటం లేదు. నీటి కోసం పడుతున్న ఇబ్బందులు తెలియ చెప్పేందుకే రోడ్డు ఎక్కినట్లు'' మహిళలు చెప్పారు. సమాచారం అందుకున్న ఎస్సై వేమన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కమిషనర్‌ను కలిసి సమస్య చెప్పాలని మహిళలకు సూచించారు. తాము కూడా కమిషనర్ దృష్టికి సమస్య తీసుకెళ్తామని చెప్పటంతో సుమారు అర్ధగంట పాటు చేపట్టిన నిరసనను విరమించారు. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

గురువులకు గుర్తింపు

- నలుగురికి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు
- జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా 53 మంది ఎంపిక
- ఈనెల 5 ఉపాధ్యాయ దినోత్సవం రోజు అవార్డుల ప్రదానం

ఒంగోలు సిటీ:

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబరు 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం అందించే రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా నుంచి నలుగురు ఉపాధ్యాయులు, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా 53 మంది ఎంపికైనట్లు డీఈఓ కిరణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తర్లుపాడు జెడ్పీ హైస్కూల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంగా పనిచేస్తున్న ముత్తోజు సుధాకర్, వెలిగండ్ల మండలం మొగళ్లూరు జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న బి.సరోజినిదేవి, పీసీపల్లి జెడ్పీ హైస్కూల్ సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న జీ ఈశ్వరమ్మ, మద్దిపూడి మండలం తంగెళ్ల జెడ్పీ హైస్కూల్ హిందీ టీచర్‌గా పనిచేస్తున్న గుంటగాని భాస్కరరావు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులకు ఈనెల 5వ తేదీ విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో అవార్డులు అందజేస్తారన్నారు.

తరగతి గది రూపు మార్చి...



తర్లుపాడు: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన తర్లుపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.సుధాకర్ మూడేళ్లుగా అక్కడ పనిచేస్తున్నారు. విద్యార్థులకు ఉత్తమ విద్యనందించడంలో ముందున్నారు. పూర్వ విద్యార్థుల ద్వారా రూ.50 లక్షలకుపైగా విరాళాలు సేకరించి తాను పనిచేస్తున్న పాఠశాలలో తరగతి గదుల ఆధునీకీకరణ, వంటగది, తరగతి గదిలో బెంచీల ఏర్పాటు, పెయింటింగ్‌తో పాఠశాల రూపురేఖలు మార్చేశారు. కొన్నేళ్లుగా ఆ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సందర్భంగా సుధాకర్‌కు డివిజన్‌లోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రయోగాత్మకంగా విద్యాబోధన



వెలిగండ్ల, (కనిగిరిరూరల్): వెలిగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన భౌతిక రసాయన శాస్త్రాల ఉపాధ్యాయురాలు బీ సరోజనీదేవి రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. సరోజనీదేవి మొగళ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో వెలిగండ్ల పాఠశాలకు వెళ్లారు. రసాయన శాస్త్రంలో ప్రయోగాత్మకంగా విద్యాబోధన, సైన్స్ ప్రయోగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఆమె ముందున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సరోజనీదేవిని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

డ్రాప్‌అవుట్‌లను బడిబాట పట్టించి..



మద్దిపూడి: మండలంలోని తంగెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గుంటగాని భాస్కర్‌రావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. డ్రాప్‌అవుట్‌లను నిరోధించడం, విద్యార్థుల రోల్ పెంచడం, పదో తరగతి విద్యార్థుల మీద ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాలు రాబట్టడంలో ఆయన ముందున్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన సందర్భంగా ఆయనకు సహచర ఉపాధ్యాయులు, ఎంఈవో రంగయ్య అభినందనలు తెలిపారు.

పేద విద్యార్థుల ఉన్నత చదువులకు చేయూత



పీసీపల్లి: మండల పరిధిలోని పీసీపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో సోషల్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గడ్డం ఈశ్వరి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. దాతల సహకారంతో తాను పనిచేసే పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడం, పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివించేందుకు చేయూతనందించడం, తాను తొలిసారి ఉపాధ్యాయురాలిగా చేరిన అంక భూపాలపురంలో ఎంతోమంది పేద విద్యార్థులు నవోదయ సీట్లు సాధించేలా ఆమె కృషి చేశారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ఈశ్వరిని ఎంఈఓ ఆర్ శ్రీనివాసచారి, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా 53 మంది

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 53 మంది ఎంపికయ్యారు. వారిలో 10 మంది ప్రధానోపాధ్యాయులు, 23 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, 20 మంది స్కూల్‌అసిస్టెంట్లు ఉన్నారు. ఎంపికైన ప్రధానోపాధ్యాయుల్లో గిద్దలూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.సిద్దేశ్వరశర్మ, తాళ్లూరు మండలం తూర్పు గంగవరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వై.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బేస్తవారిపేట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మన్నం శ్రీదేవి, కొండపి మండలం, పెదకండ్లగుంట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పి.మహబూబ్ ఖాన్, కనిగిరి గరల్స్ హైస్కూల్ హెచ్‌ఎం జి.సంజీవి, మార్కాపురం మండలం, కంబాలదిన్నె జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఆర్.మాలకొండయ్య, యర్రగొండపాలెం మండలం, గంజివారిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వి.సుబ్బారెడ్డి, కనిగిరి మండలం, చాకిచర్ల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం టి.పెద్దిరెడ్డి, కొత్తపట్నం మండలం, ఈతముక్కల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్.చెంచుపున్నయ్య, నాగులుప్పలపాడు మండలం, వినోదరాయునిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎల్.వి.ఎస్.రమేష్‌లకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గాయపడిన రామారావును 108 వాహనంలో తీసుకువెళుతున్న దృశ్యం

సింగరాయకొండ: బొలేరో, మోటారుసైకిల్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చిన్న కనుమళ్ల వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కొత్తపట్నం మండలం ఆలూరు గ్రామానికి చెందిన రామారావు(45) బేల్దారీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పని నిమిత్తం మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై కందుకూరు వెళుతుండగా చిన్న కనుమళ్ల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. ఘటనలో రామారావు కిందపడి వాహనం కాలుపై నుంచి వెళ్లడంతో కుడి కాలు విరిగి తీవ్ర రక్తస్రావమైంది. క్షతగాత్రుడ్ని 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

మొండి బకాయిదారులకు నోటీసులు

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొంది చెల్లించని బకాయిదారులు, వారికి హామీగా ఉన్న 364 మందికి నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణ బకాయిలు పూర్తిస్థాయిలో రికవరీ చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యాలు నిర్దేశించారన్నారు. లబ్ధిదారులకు హామీ ఉన్న ఉద్యోగుల నుంచి రుణాలు రికవరీ చేస్తామన్నారు. రుణాలు చెల్లిస్తేనే నూతన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. రుణ రికవరీకి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సిబ్బందిని కేటాయించామన్నారు.

యువ వ్యాపారి ఆత్మహత్య

- వైపాలెం మండలం బోయలపల్లిలో హృదయవిదారక సంఘటన
- బైక్‌పై ఇద్దరు కుమార్తెలు, కుమారుడిని తీసుకెళ్లిన వెంకటేశ్వర్లు
- తెలంగాణలోని వెల్దండి మండలం బూరకుంట వద్ద పురుగులమందు తాగి ఆత్మహత్య
- చిన్నారుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు
- ఆత్మహత్య చేసుకునేంత ఆర్థిక సమస్యలు లేవంటున్న గ్రామస్తులు



మృతుడు వెంకటేశ్వర్లు (ఫైల్)

యర్రగొండపాలెం:

తన ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిన యువ వ్యాపారి బుధవారం శవమై కనిపించాడు. ఈ విషాద వార్త ఆ కుటుంబాన్ని శోకసంద్రంలోకి నెట్టగా.. పిల్లలు ఏమయ్యారో అంతుచిక్కక బంధువులతోపాటు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. యర్రగొండపాలెం మండలంలోని బోయలపల్లి గ్రామానికి చెందిన ఫెర్టిలైజర్ దుకాణం యజమాని గుత్తా వెంకటేశ్వర్లు(35), దీపిక దంపతులకు ముగ్గురు పిల్లలు. వెంకటేశ్వర్లు బోయలపల్లిలో వ్యవసాయం చేస్తూనే ఎరువుల దుకాణం నిర్వహిస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 31వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో వెంకటేశ్వర్లు తన కుమార్తెలు దీపిక(8), వర్షిణి(6), కుమారుడు శివధర్మ(4)ను బైక్‌పై ఎక్కించుకుని బయటికి వెళ్లాడు. పిల్లలను బైక్‌పై కాసేపు తిప్పి ఇంటికి వస్తాడని కుటుంబ సభ్యులు భావించారు కానీ రాత్రి పొద్దుపోయాక కూడా ఇంటికి చేరలేదు. ఒకటో తేదీన శ్రీశైలంలో ఉన్నట్లు తెలుసుకున్న బంధువులు అక్కడ వెతికారు. అయినప్పటికీ వారి జాడ తెలియకపోవడంతో శ్రీశైలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని వెల్దండి మండలం పెద్దాపూర్ గ్రామ సమీపాన హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిలోని బూరకుంట వద్ద వెంకటేశ్వర్లు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆ ప్రాంత పోలీసులు బుధవారం వేకువజామున గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.



మృతుడి ఇంటి వద్ద విషణ్ణవదనంలో బంధువులు

గత మూడు రోజుల నుంచి కనిపించకుండా పోయిన వెంకటేశ్వర్లు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలియడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుడి భార్య దీపిక, తల్లి వెంకటలక్ష్మి, అత్త పాలడుగు రాధ బోరున విలపిస్తున్నారు. కాగా వెంకటేశ్వర్లుకు ఆర్థిక ఇబ్బందులు లేవని, అందరితో బాగుంటాడని గ్రామస్తులు చెబుతున్నారు.

చిన్నారుల ఆచూకీ చిక్కేనా?

వెంకటేశ్వర్లు తన కుమార్తెలు, కుమారుడితో కలిసి నాగర్ కర్నూల్ జిల్లా డిండి ప్రాజెక్ట్, హాజీపూర్ పరిసరాల్లో బైక్‌పై తిరిగినట్లు సీసీ పుటేజీల ఆధారంగా ఆ ప్రాంత పోలీసులు గుర్తించారు. హాజీపూర్ వద్ద ఉన్న పెట్రోల్ బంకుకు సమీపంలో రెండో కుమార్తె, కుమారుడిని వదలి పెట్టినట్లు తెలుస్తోంది. పెద్ద కుమార్తెను బైక్‌పై తీసుకెళ్లిన వెంకటేశ్వర్లు బూరకుంట వద్ద శవమై కనిపించాడు. మోక్షితను ఎక్కడ వదలి పెట్టాడు? పెట్రోల్ బంక్ వద్ద వదిలి వెళ్లిన ఇద్దరు చిన్నారుల ఆచూకీ ఎక్కడనే విషయంపై తెలంగాణ పోలీసులు దర్యాప్తు

హనీ, లక్కీ, నానీ ఎప్పుడొస్తారు?



కనిపించకుండా పోయిన చిన్నారులు(ఫైల్)

వెంకటేశ్వర్లు మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. వెంకటేశ్వర్లు పెద్ద కుమార్తె దీపిక పెద్దారవీడు మండలంలోని రాజుపాలెంలో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో 5వ తరగతి చదువుకుంటుంది. రెండవ కుమార్తె వర్షిణి, చిన్న కుమారుడు శివధర్మ స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్నారు. ‘హనీ, లక్కీ, నానీ(మిస్ అయిన పిల్లల నిక్‌నేమ్‌లు) ఏమయ్యారు అంకుల్, ఎక్కడున్నారు? ఎప్పుడు ఇంటికొస్తార’ని వారి స్నేహితులు గుక్క తిప్పుకోకుండా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.



బైక్‌పై పెద్ద కుమార్తె మోక్షితతో వెంకటేశ్వర్లు (సీసీ ఫుటేజ్ దృశ్యం)

విద్యుదాఘాతానికి యువకుడు మృతి

- మరో ఇద్దరికి గాయాలు



రాకేష్ మృతదేహం

కొనకనమిట్ల: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని నాగంపల్లి ఎస్సీ కాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గొట్లగట్టు ఎస్సీ కాలనీకి చెందిన ఎండూరి ప్రభాకర్, దీనమ్మ దంపతుల కుమారుడు రాకేష్(18) పదో తరగతి వరకు చదువుకున్నాడు. పైచదువులకు ఆర్థికస్థోమత లేకపోవడం, తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేందుకు కూలి పనులకు వెళుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం టెంట్ హౌస్ పని నిమిత్తం నాగంపల్లి ఎస్సీ కాలనీలో జరిగే ఓ వేడుకకు స్టేజీ ఏర్పాటు చేసేందుకు రాకేష్, గొంగటి బన్ని, విష్ణులు గొట్లగట్టు నుంచి వెళ్లారు. ముగ్గురు స్టేజీ ఏర్పాటు చేస్తున్న క్రమంలో పైప్ పైన ఉన్న విద్యుత్ తీగలకు తగలటంతో ముగ్గురు విద్యుదాఘాతానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన రాకేష్ మృతి చెందగా, బన్నీ, విష్ణులు గాయపడ్డారు. క్షతగాత్రులను పొదిలి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ జీవనం సాగిస్తున్న తరుణంలో కుమారుడు రాకేష్ మృతి చెందటంతో తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ముల్లా మహ్మద్ తెలిపారు. రాకేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

జేఎల్‌ఎంకు తీవ్ర గాయాలు

హనుమంతునిపాడు: విద్యుత్ షాక్‌కు గురై ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కిందపడి సచివాలయ జేఎల్‌ఎంకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..సీతారాంపురం సచివాలయంలో శ్రావణ్ కుమార్ జేఎల్‌ఎంగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో హనుమంతునిపాడు సచివాలయంలో విద్యుత్ శాఖలో జేఎల్‌ఎం లేకపోవడంతో విద్యుత్ అధికారులు చెప్పిన ప్రకారం హనుమంతునిపాడులో డిప్యూటేషన్ కింద పనిచేస్తున్నాడు. బుధవారం పెద్దిరెడ్డి తోటలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తూ 11 కెవీ ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి హెడ్ ఫీజులు వేస్తున్నాడు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. విద్యుత్ షాక్‌తో స్పృహ కోల్పోవడంతో కనిగిరి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

త్రిపురాంతకం మండలం అన్నసముద్రం సమీపంలో దుర్ఘటన



కొండమ్మ మృతదేహం

త్రిపురాంతకం: అమరావతి–అనంతరం నేషనల్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని పాత అన్నసముద్రం గ్రామానికి చెందిన పి. రాజు, కొండమ్మ దంపతులు స్వగ్రామం నుంచి మేడపికి సరుకులు కొనుగోలు చేసేందుకు బైక్‌పై వెళుతున్నారు. అదే సమయంలో వినుకొండ వైపు వెళుతున్న టాటా ఏసీ వాహనం ముందు వెళుతున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో భార్యభర్తలు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రుల మృతితో వీరు అనాథలుగా మారారు. భార్యభర్తల మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ప్రమాద స్థలాన్ని సీఐ అసాన్, ఎస్సై శివ బసవరాజు సందర్శించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెల్లరాయి తవ్వకాలపై విజిలెన్స్ దాడులు



అక్రమంగా మైనింగ్ చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైనింగ్

పీసీపల్లి: తెల్లరాయి అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ అండ్ మైనింగ్ అధికారులు దాడులు చేశారు. మండల పరిధిలోని మురుగమ్మి, తురకపల్లి గ్రామాల్లో తెల్లరాయి అక్రమంగా తవ్వేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న విజిలెన్స్, మైనింగ్ అధికారులు రెండు గ్రామాల్లో దాడులు చేశారు. ఆయా ప్రాంతాల్లో తవ్వుతున్న వాహనాలను సీజ్ చేశారు. ఆర్‌వీఎస్ ఒంగోలు రామచంద్రయ్య ఆధ్వర్యంలో ఆర్‌ఐ శంకరయ్య, తిరుపతిరావు, కృష్ణారావు, పోలిరెడ్డిలు దాడులు చేశారు. అక్రమంగా తవ్వి తరలించేందుకు సిద్ధంగా ఉన్న రాయిని సీజ్ చేశామని పేర్కొన్నారు.


ఎరువులు దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఎరువు బస్తాలను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీకృష్ణ ట్రేడర్స్‌లో తనిఖీలు చేశారు. తనిఖీల్లో విక్రయాల వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడం, ఎరువుల నిల్వల్లో అవకతవకలు గుర్తించి 256 బస్తాల యూరియా, 15 బస్తాల 24-24 ఎరువులను సీజ్ చేశారు. దుకాణ నిర్వాహకులపై 6ఏ కేసు నమోదు చేశారు. చక్రవర్తి ట్రేడర్స్‌లో 12.75 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. నరవ, పొదలకుంటపల్లె గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లోని గొడౌములలో నిల్వ ఉన్న స్టాక్ రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సీహెచ్.రవిబాబు, ఎస్సై జి.నాగేశ్వరరావు, ఏఓ విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు ఓట్లు ఉంటే పోటీకి అనర్హత



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఓబులేసు

ఒంగోలు సిటీ: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి ఒక ఓటు మాత్రమే ఉండాలని, రెండో ఓటు ఉంటే పోటీకి అర్హత ఉండదని డీఆర్‌ఓ ఓబులేసు అన్నారు. స్థానిక కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాలులో జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ కేంద్రాలను 2183 నుంచి 2263కు పెంచామన్నారు. త్వరలో ఇంటింటి సర్వే చేసి తప్పులు ఉన్న వాటిని సరిచేస్తామని తెలిపారు. రెండు ఓట్లు ఉన్న వారు వెంటనే రెండో ఓటును తొలగించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధి రామరాజు క్రాంతికుమార్ మాట్లాడుతూ రెండేసి ఓట్లు ఉన్న వారు వేలల్లో ఉన్నారని, వాటిని ఆధార్ అనుసంధానం చేసి తొలగించాలని కోరారు. సమావేశంలో కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, ఈఆర్వోలు వెంకట శివరామిరెడ్డి, జాన్సన్, వరకుమార్, జిల్లా ఎలక్షన్ సెల్ శ్రీనివాసరావు, డీటీ రాజశేఖర్‌రెడ్డి, ఉపేంద్ర, ఒంగోలు డీటీ సలోమి, కృష్ణమోహన్, తహసీల్దార్లు శాంతి, బ్రహ్మయ్య, ఆంజనేయరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పింఛన్లు పీకేశారు!

- కూటమి నేతల కుట్రతో వృద్ధులు, దివ్యాంగులు విలవిల
- పింఛన్ నగదు ఇచ్చిన మరుసటి రోజే వెనక్కు.



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న వృద్ధులు, దివ్యాంగులు

బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గంలో పింఛన్ల తొలగింపు కుట్రకు కూటమి నేతలు తెరలేపారు. రీవెరిఫికేషన్ పేరుతో దివ్యాంగ పింఛన్లు తొలగించే ప్రక్రియను కూటమి సర్కారు ఇప్పటికే ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే టీడీపీ, జనసేన గ్రామ నాయకుల కోరిక మేరకు ఎమ్మెల్యే నుంచి వచ్చిన ఆదేశాలతో అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. రీవెరిఫికేషన్ నోటీసులు అందుకున్న లబ్ధిదారులకు సెప్టెంబర్ నెల నగదు అందజేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా వాటిని తుంగలో తొక్కారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల పింఛన్లు తొలగించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే ద్వారా లెటర్ పంపినట్లు టీడీపీ చోటా నేతలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుండటం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇటీవల రాచర్ల మండలం ఓబుల్‌రెడ్డి పల్లెలో 21 మందికి పింఛన్లు నిలిపివేశారు. తాజాగా బేస్తవారిపేట మండలంలోని గంటాపురంలో 19 మంది పింఛన్లు, పెద్ద ఓబినేనిపల్లెలో నలుగురు, బేస్తవారిపేటలో ముగ్గురు.. ఇలా మొత్తం 28 పింఛన్లు ఉద్దేశపూర్వకంగా ఆపేశారు. రాచర్ల మండలంలో 67 పింఛన్లు, అర్ధవీడు మండలంలో 5 పింఛన్లు తొలగించేందుకు ఇప్పటికే రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

అలా ఇచ్చి.. ఇలా గుంజుకుని..

లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకుని ఇచ్చిన పింఛను సొమ్మును స్థానిక సచివాలయ ఉద్యోగులు ఆ మరుసటి రోజే వెనక్కు తీసుకున్నారు. కూటమి నాయకుల ఒత్తిడితోనే ఇంత దుర్మార్గంగా వ్యవహరించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బేస్తవారిపేట మండలంలోని గంటాపురంలో చప్పిడి చెన్నకేశవులుకు రూ.6 వేల పింఛను ఇచ్చారు. కూటమి నాయకుల ఒత్తిడితో మరుసటి రోజు ఆయన ఇంటికి వెళ్లి వెనక్కు తీసుకున్నారు.

ఎంపీడీఓను నిలదీత

గంటాపురంలో 16 మంది వృద్ధాప్య, ముగ్గురు దివ్యాంగులకు పింఛన్ ఇవ్వకపోవడంతో బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. తమ పింఛన్లు ఎందుకు నిలిపేశారని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులను ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డితో కలిసి నిలదీశారు. ఫిర్యాదు రావడంతో తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టామని, విచారణ అనంతరం ఇస్తామని ఎంపీడీఓ చెప్పగా ‘ఎవరు ఫిర్యాదు చేశారు, అన్యాయంగా మా పొట్టకొట్టవద్దు. దివ్యాంగుల పింఛను పరిశీలించాలని చెబుతూ, ఓఏపీ పింఛన్లు ఎందుకు నిలిపార’ని ఎంపీడీఓను ప్రశ్నించారు. తాముకూడా అడ్డగోలుగా ఫిర్యాదు చేస్తే అందరికీ పింఛన్లు నిలిపివేస్తారా అని ఎంపీపీ ప్రశ్నించడంతో మౌనమే సమాధానమైంది. ఎటువంటి విచారణ చేయకుండానే పింఛన్లు ఆపడం సమంజసం కాదని, మంజూరైన పింఛను సొమ్ము చెల్లించాలని ఎంపీపీ సూచించారు.

పింఛనే సొమ్మే దిక్కు



వికలాంగుల సర్టిఫికెట్‌లో 54 శాతం ఉంది. రూ.6 వేల పింఛన్ తీసుకుంటున్నా. ఆధార్ కార్డులో 1948లో డేట్ ఆఫ్ బర్త్ నమోదైంది. భర్త లింగయ్య 20 ఏళ్ల క్రితం మృతిచెందాడు. 77 ఏళ్ల వయసులో ఏ పనీ చేసుకోలేను. పింఛన్ సొమ్ముపై ఆధారపడి జీవిస్తున్నా.

– మండ్లా గురమ్మ, గంటాపురం

కళ్లు లేనోన్ని.. కష్టాలు పెట్టమాకండి



ఒక కన్ను పూర్తిగా లేదు, మరొక కన్ను సరిగా కనిపించదు. ఆధార్‌కార్డులో 1970లో పుట్టినట్లు నమోదైంది. బయోమెట్రిక్ వేయించుకుని రూ.6 వేలు నగదు ఇచ్చారు. మరుసటి రోజు వచ్చి నగదు వెనక్కు తీసుకున్నారు. దివ్యాంగుల పొట్ట కొట్టొద్దు.

– చప్పిడి చెన్నకేశవులు, గంటాపురం

వృద్ధులు, దివ్యాంగులకు అన్యాయం



నా ఆధార్ కార్డు ప్రకారం 73 ఏళ్ల వయస్సు ఉంది. వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్నా. ఎవరో ఫిర్యాదు చేశారని మా లాంటి వృద్ధుల పింఛన్లు తొలగించడం అన్యాయం. ఉన్నతాధికారులు పింఛన్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి.

– శనివరపు నర్సిరెడ్డి

వైఎస్సార్ సీపీ జెండా పోల్ తీస్తావా.. రౌడీషీట్ ఓపెన్ చేయమంటావా..

- తొర్రగుడిపాడులో ఎస్సై బరితెగింపు



తొర్రగుడిపాడులో వైఎస్సార్‌సీపీ జెండా పోల్‌ను తీయిస్తున్న దృశ్యం

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎస్సై వేధింపులు ఆగడం లేదు. వివరాల్లోకి వెళితే..మండలంలోని తొర్రగుడిపాడు గ్రామంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పంచాయతీ కార్యాలయం కూడలిలో ఉన్న వైఎస్సార్ సీపీ జెండా పోల్ వద్ద వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించి వెళ్లిపోయారు. అయితే రాత్రి 9 గంటల సమయంలో ఎస్సై కృష్ణయ్య తొర్రగుడిపాడు వచ్చి వైఎస్సార్ కార్యకర్తల గృహాలకు వెళ్లి..వైఎస్సార్ సీపీ జెండా పోలు తీసివేయాలని, లేకుంటే రౌడీషీట్ ఓపెన్ చేస్తానని హెచ్చరించాడు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసేది లేక జెండా పోలు తీశారు. ఎస్సై తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్ సీపీ శ్రేణులను టార్గెట్ చేసుకొని రౌడీషీట్ ఓపెన్ చేస్తానంటూ భయభ్రాంతులకు గురిచేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

మానసిక వికాసానికి కళలు దోహదం

- ఎస్పీ ఏఆర్ దామోదర్



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఒంగోలు టౌన్: సంస్కృతీ సంప్రదాయాలకు పుట్టినిల్లు మన భారతదేశమని, దేశ సంస్కృతిని చాటి చెప్పే నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించడం అభినందనీయమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియంలో బుధవారం జరిగిన నవోదయ విద్యాలయం రీజనల్ స్థాయి కళా ఉత్సవ్ ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. భారతీయ సంప్రదాయ పద్ధతిలో విద్యార్థులు ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో ఎస్పీ మాట్లాడుతూ...విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను కళా ఉత్సవాలు వెలికి తీస్తాయని చెప్పారు. చదువుతో పాటు కళల్లో కూడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కళలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని చెప్పారు. సమాజంలో మనుషుల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తాయన్నారు. భరత నాట్యం, కూచిపూడి వంటి నృత్యాలతో సంపూర్ణ ఆరోగ్యం ప్రాప్తిస్తుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒంగోలుకు తరలిరావడం సంతోషం కలిగిస్తుందన్నారు. కళా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. రెండో రోజు కళా ఉత్సవాలు ఉల్లాసభరిత వాతావరణంలో జరిగాయి. పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాతో పాటుగా అండమాన్ నికోబార్, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి తదితర రాష్ట్రాల నుంచి 165 మంది విద్యార్థులు తరలివచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, తాలుకా సీఐ విజయకృష్ణ, వన్‌టౌన్ సీఐ నాగరాజు, నవోదయ ప్రిన్సిపాల్ సి.శివరామ్ , వివిధ జిల్లాలకు చెందిన నవోదయ ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో ఆత్మహత్యాయత్నం.. దంపతులపై కేసు నమోదు

గిద్దలూరు రూరల్: స్థానిక కోర్టు ఆవరణలో పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన పిచ్చిరెడ్డి, అతడి భార్య నాగమణిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.సురేష్ తెలిపారు. మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన పిచ్చిరెడ్డి అదే గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డితో పాటుగా మరి కొందరిపై ఘర్షణ పడ్డారు. ఈ విషయలంలో పోలీస్‌స్టేషన్‌లో తనకు న్యాయం జరగలేదని ఆత్మహత్య యత్నానికి పాల్పడినందుకు కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.